సాక్షి చిత్తూరు

గురువారం । 5 । అక్టోబర్ । 2023



జిల్లాకు 5వేల ఈవీఎంలు

జిల్లాకు ఐదు వేల ఈవీఎంలు వచ్చాయని, వీటి పరిశీలనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - 8లో



కామధేనువుపై కటాక్షం

కాణిపాకం ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం రాత్రి కామధేను వాహనంపై స్వామి వారు భక్తులను కటాక్షించారు - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	35	25
తిరుమల	31	22
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

3 టన్నుల కూరగాయల వితరణ



కూరగాయలను అందిస్తున్న దాతలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మూడు టన్నుల కూరగాయలను శాంతిపురం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మిత్రబృందం వితరణగా అందజేశారు. బుధవారం మధ్యాహ్నం దాతలు ప్రత్యేక వాహనంలో కూరగాయలను ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ ఈఓ వెంకటేశుకు వీటిని అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రతి శుక్రవారం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా, మండల, స్పెషల్ ఆఫీసర్‌లు, మండల, గ్రామ స్థాయి అధికారులు కచ్చితంగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ నెల 6న యాదమరి మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 13న సదుం, 20న గుడుపల్లె, 27న గంగవరంలో కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు.

వేగవంతంగా భూ రీసర్వే



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రీ సర్వే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఉన్నతాధికారులకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వివరించారు. రీ సర్వే పురోగతిపై సీసీఎల్‌ఏ కమిషనర్ సిద్ధార్థజైన్ విజయవాడ నుంచి జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రీ సర్వే పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు దశ రీ సర్వే పూర్తి అయినట్లు పేర్కొన్నారు. మొదటి దశలో 132 గ్రామాల్లో, రెండవ దశలో 91 గ్రామాల్లో సర్వే పనులు పూర్తి అయినట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో సమస్యలున్నట్‌లైతే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. రోజు వారి పనులను పర్యవేక్షిస్తున్నట్లు జేసీ వివరించారు.

పకడ్బందీగా ఎస్‌ఈఏఎస్ సర్వే

చిత్తూరు కలెక్టరేట్ : నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి విద్యాశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థుల సర్వేకు సంబంధించి పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాట్లను డీసీఈబీ సెక్రటరీ హేమారెడ్డి వివరించారు. సమగ్రశిక్ష శాఖ ఏఎంవో పల్లవి, డీఈవో కార్యాలయ సిబ్బంది జయప్రకాష్ పాల్గొన్నారు.

9న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

శాంతిపురం: స్థానిక ఐటీఐలో ఈనెల 9న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. ఈ మేళాలో హోండా, ముసాషి ఆటో పార్ట్స్, హిందాల్కో, లూమినోస్ బ్యాటరీస్, అమరరాజా బ్యాటరీస్, వైజీ కటింగ్ టూల్స్ కార్పొరేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని, ఆయా పరిశ్రమల్లో అర్హులకు అప్రెంటిస్ చేసే అవకాశాన్ని కల్పిస్తారన్నారు. జిల్లాలో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

7న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

కుప్పంరూరల్: ఈనెల 7వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి స్కూల్స్‌గేమ్స్‌లో భాగంగా కుప్పం మండలం కొత్తయిండ్లు ఉన్నత పాఠశాల మైదానంలో షూటింగ్ బాల్ అండర్-17 బాలబాలికల జట్ల ఎంపిక ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరు కావచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 7989811005 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.





అమ్మవారి దర్శనానికి భక్తుల క్యూ



పోలేరమ్మ తల్లి

జన జాతర

దేశవిదేశాల నుంచి తరలివచ్చిన వెంకటగిరీయులు.. జన సంద్రంగా మారిన పురవీధులు.. కట్టిపడేసేలా కళాప్రదర్శనలు.. ఇంటింటికీ వెళుతున్న మడి భిక్షాలు.. బంధుమిత్రుల రాకతో కళకళలాడుతున్న లోగిళ్లు.. పోలేరమ్మతల్లి ఆలయం వైపే సాగుతున్న అన్ని దారులు.. పుట్టింటి రూపంతో మెట్టింటి తేజంతో రథంపై కొలువుదీరిన శక్తిస్వరూపిణిని వీక్షించి తరించిన భక్త సందోహం నడుమ 'అమ్మ' సంబరం అట్టహాసంగా ఆరంభమైంది. రాష్ట్ర పండుగ హోదాలో జన జాతర వైభవోపేతంగా సాగుతోంది.

- వెంకటగిరి పోలేరమ్మ సేవకు పోటెత్తిన భక్తులు
- సంప్రదాయబద్ధంగా గాలి గంగుల పూజలు
- కనులపండువగా రథోత్సవం
- పుట్టింటి నుంచి మెట్టింటికి అమ్మవారి ప్రతిమ
- వేపమండల నడుమ కొలువైన శక్తి స్వరూపిణి
- నేడు నిలుపు.. నిమజ్జనోత్సవం



పోలేరమ్మ ఆలయం వద్ద విశేష పుష్పాలంకరణ

సైదాపురం/వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మ జాతర కనులపండువగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ నలుమూల నుంచి ఎక్కడెక్కడో స్థిరపడిన వెంకటగిరి వాసులు పెద్దసంఖ్యలో జాతరను తిలకించేందుకు తరలివచ్చారు. తొలిసారి రాష్ట్ర పండుగ హోదాలో జాతర జరుగుతుండడంతో భారీగా ఏర్పాట్లు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు. భక్తులను ఆకట్టుకునేలా విశేష సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం ఈ మేరకు ఆయన అమ్మవారి నిలుపు స్థలం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. క్యూల ఏర్పాటుపై పలు సలహాలు అందించారు. ఈ క్రమంలో పోలేరమ్మ దర్శనానికి విచ్చేసిన భక్తులతో వెంకటగిరి కిక్కిరిసిపోయింది. ఇసుకేస్తే రాలనంతగా జనసంద్రంగా మారిపోయింది.

వైభవంగా రథోత్సవం

కుమ్మరివీధిలోని పుట్టింటి వద్ద పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా జీనిగలవారి వీధికి తీసుకెళ్లారు. సంప్రదాయబద్ధంగా గాలి గంగులకు పూజలు నిర్వహించారు.అమ్మవారికి కళ్లు,బుగ్గ చుక్క పెట్టారు. ఈ క్రమంలో రథంపై కొలువుదీరిన గ్రామశక్తిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. పాతకోట మీదుగా పోలేరమ్మ ఆలయం వరకు వైభవంగా రథోత్సవం సాగింది. వేప మండలతో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. సాయంత్రం పోలేరమ్మకు నగరోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం నిమ్మజ్జన కార్యక్రమంతో జాతర పరిపూర్ణం కానుంది.

పకడ్బందీ భద్రత : ఎస్పీ

పోలేరమ్మ జాతరకు పకడ్బందీ భద్రత కల్పించినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వెంకటగిరి పట్టణంలో జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతర బందోబస్తులకు వెయ్యి మంది పోలీసులను నియమించామన్నారు. సుమారు 2లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున కట్టుదిట్టంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నిఘా నిమిత్తం వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వెంకటగిరి పోలీసుస్టేషన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశామని వెల్లడించారు. ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తొక్కిసలాటలు జరగకుండా ముందస్తుగా 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులకు విధులు కేటాయించామని తెలిపారు. ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీలు నరసప్ప, సూర్యనారాయణరెడ్డి, రాజగోపాలరెడ్డి, రవికుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.



ఏర్పాట్ల పరిశీలనలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



విక్రయానికి సిద్ధంగా జీవాలు



మడి భిక్షాల సందడి





బాణ సంచా వెలుగులు



అమ్మవారి సేవకు సిద్ధంగా రథం



పురవీధుల్లో కొబ్బరికాయల అమ్మకం



సూచనలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

అర్హులందరికీ గృహాలు మంజూరు



సమీక్షలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పక్కన కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ గృహాలను మంజూరు చేస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన గంగాధరనెల్లూరు నియోజకవర్గ గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పలు చోట్ల కొత్తగా ఇంటి స్థలాలు, గృహ నిర్మాణానికి అనుమతులు కావాలని ప్రజలు వినతిపత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గృహ నిర్మాణాల పురోగతికి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా అర్హులుంటే అనుమతులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో విచారించి మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, హౌసింగ్ అధికారులు వెంకటేశ్వర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

141 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నాడు-నేడు రెండవ దశ పనుల పురోగతిలో అలసత్వం వహించిన 141 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పనులకు నిధులు ఉన్నప్పటికీ ఎందుకు ఖర్చు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 15 రోజులుగా నిధులు ఖర్చు చేయకుండా విధుల పట్ల అలసత్వం వహించిన 141 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డీఈవో, సమగ్రశిక్ష ఏపీసీలను ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొన్ని పాఠశాలల్లో పనులు చేస్తున్నప్పటికీ బిల్లులు ఎందుకు అప్‌లోడ్ చేయడం లేదని క్షేత్రస్థాయి అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సరైన సమాధానలు చెప్పని పలువురు ఎంఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధే విమర్శకులకు సమాధానం

- నగరిలో రూ.2.30 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- మంత్రి ఆర్కేరోజా



భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్కేరోజా (ఇన్‌సెట్) షాపింగ్ కాంప్లెక్స్ నమూనా

నగరి : నగరి బస్టాండ్ ప్రాంగణంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 ఏళ్ల కిందట రోడ్ల వెడల్పులో భాగంగా బస్టాండు ప్రాంగణంలోని మున్సిపల్ కాంప్లెక్సను తొలగించారన్నారు. అప్పటి నుంచి పట్టువదలకుండా చేసిన ప్రయత్నాలతో నేడు కాంప్లెక్స్ నిర్మాణం సాధ్యమైందన్నారు. 897.67 చదరపు అడుగుల విస్తీర్ణంలో గుడ్‌విల్ బేసిస్‌లో రూ.2.30 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 31 గదులు, ఫస్ట్ ఫ్లోర్‌లో 31 గదులు, సెకండ్ ఫ్లోర్‌లో మీటింగ్ హాలు, ఆఫీసులకు 3 గదులు మంజూరైన నమూనాలో తొలివిడతగా 31 గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. వీటికి వేలం ముగిసి నిబంధనల మేరకు షాపులను కూడా కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

ఎన్నడూ లేని విధంగా..

నగరిలో ఎన్నడూ లేని విధంగా జరిగిన అభివృద్ధి పనులే విమర్శలకు సమాధానం చెబుతాయని మంత్రి ఆర్కేరోజా అన్నారు. రూ.5.4 కోట్ల వ్యయంతో ఏరియా ఆస్పత్రి ఆధునికీకరించడంతోపాటు నగరి, పుత్తూరులో నాలుగు అర్బన్ హెల్త్‌సెంటర్లు నిర్మించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సకల వసతులతో ఆధునికీకరించామని, పార్కులు, కల్యాణ మండపాలు, షాదీమహల్‌లు, ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయాలు, సమావేశ మందిరాలు, విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, అయ్యప్పన్ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని, ఇది పేద ప్రజలకు ఒక వరంలాంటిదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దభర్నేపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి స్పెషలిస్టులు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 207 మంది వైద్య సేవలు పొందరని 41 మందికి కంటి పరీక్షలు చేయించుకోగా, అందులో 31 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ శ్రీనివాసులు, వైద్యాధికారులు మాధవి, విజయకాంత్, సుస్మిత, విష్ణుకిరణ్, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

3.56 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం పూడి క్రాస్ వద్ద ప్రయివేట్ గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 3.56 టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పుత్తూరు ప్రభుత్వ గోడౌన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి అప్పలాయగుంట వడ్డిపల్లెకు చెందిన కీర్తి, శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెండో పెళ్లి చేసుకున్నాడని..

భర్త ఇంటి ముందు ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఆరోపిస్తూ.. మొదటి భార్య ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చిత్తూరు నగరంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి.. తిరుపతికి చెందిన షబానాకు చిత్తూరుకు చెందిన నాశీర్‌తో పెళ్లయ్యి ఓ బిడ్డ కూడా ఉన్నాడు. అదనపు కట్నం, బాడీ షేమింగ్ చేస్తున్న భర్త వేధింపులు తాళలేక చిత్తూరు దిశ పోలీసులకు షబానా ఫిర్యాదు చేసింది. కొద్దికాలంగా బిడ్డను తీసుకుని బంగారుపాళ్యంలోని తన బంధువుల ఇంట్లో ఉంది. ఈ క్రమంలో భర్త ఇటీవల రెండో పెళ్లి చేసకున్నాడని తెలుసుకుంది. బుధవారం చిత్తూరు మండీ వీధిలో భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఆపై ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు ఈమెను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యుల ప్రథమ చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

కామధేనువుపై కామితఫలదాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కామధేను వాహనంపై భక్తులను కటాక్షించారు. వేకువ జామున ఆలయంలో అభిషేక పూజలు, ప్రత్యేక అలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అలంకార మండపంలో శ్రీసిద్ధి, బుద్ధి, సమేత వినాయక ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి ఊరేగింపుగా తీసుకెళ్లి కామధేను వాహనంలో కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈఓ వెంకటేశు, ఆలయ మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

ఉదయం స్వామివారికి స్త్రీశిశు సంక్షేమశాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైజలా చరణ్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పట్టు వస్త్రాలను స్వామివారి చెంత పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులచే ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

నేటి కల్పవృక్ష వాహన సేవకు ఏర్పాట్లు

ప్రత్యేక ఉత్సవాల్లో గురువారం రాత్రి కల్పవృక్ష వాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉభయదారుల ఆధ్వర్యంలో ఆలయంలో విదేశీ పుష్పాలతో ఆలయం, పరిసరాలను అలంకరిస్తున్నారు. వాహన సేవకు ప్రత్యేక విదేశీ పుష్పాలు తెప్పించామని, సాయంత్రం అలంకరించనున్నట్లు వివరించారు.



కామధేను వాహనంపై ఉభయదేవేరులతో గణనాథుడు



కల్పవృక్ష వాహన సేవకు ఏర్పాట్లు



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న శైలజా చరణ్ రెడ్డి దంపతులు

చక్రపాణి రెడ్డికి పలువురి పరామర్శ



చక్రపాణిరెడ్డిని పరామర్శిసున్న మంత్రి పెద్దిరెడ్డి, నారాయణస్వామి

నింద్ర: శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డిని పలువురు ప్రముఖులు బుధవారం పరామర్శించారు. చక్రపాణిరెడ్డి తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఆయన స్వగ్రామం కొప్పేడులో లక్ష్మమ్మ కర్మక్రియలు జరిగాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకా నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ విజయానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏలుమలై(అమ్ములు), వడమాలపేట జెడ్పీటీసీ సభ్యుడు మురళీరెడ్డి, లక్ష్మీపతిరాజు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, నింద్ర జెడ్పీటీసీ సభ్యుడు పరంధామ, పలువురు నాయకులు ఉన్నారు.

రూ.6.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన ఎస్.చిట్టిబాబుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6.50 లక్షలు మంజూరైంది. ఈ సొమ్ము తాలూకు చెక్కును పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా బుధవారం తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి అందజేశారు. ఊపిరితిత్తులకు సంబంధించి వైద్య సేవలందుకున్న చిట్టిబాబు తన పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందేలా చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ, తన వైద్యానికి అయిన మొత్తాన్ని అందజేసిన సీఎం జగనన్నకు, మంత్రి రోజమ్మకు తన కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి రోజా

నియామకం

చిత్తూరు రూరల్: నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడి గా హరిప్రసాద్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఈయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా రజని కుమార్‌ను ఎన్నుకున్నారు. వారికి రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల ఎలమందరావు, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ వాయిద్య కళాకారుల సంఘం అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. మండల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న హరిప్రసాద్

వైద్య పరిశోధనలో మనమే ఫస్ట్



గుడుపల్లె: వైద్య విద్యా పరిశోధనలో ప్రపంచంలో భారత్ విద్యార్థులే టాప్ అని బెంగళూరు రాజీవ్‌గాంధీ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ సచ్చిదానంద పేర్కొన్నారు. బుధవారం పీఈఎస్ మెడికల్ కళాశాలలో 22వ బ్యాచ్ ఎంబీబీఎస్, 15వ బ్యాచ్ పోస్టు గ్రాడ్యుయేషన్ తరగతుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వైద్య విద్యార్థులకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. భారత ప్రభుత్వం ఐఆర్ఎస్ లాగానే ఐఎంఎస్ తెచ్చే ఆలోచనలో ఉందని తెలిపారు. పీఈఎస్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జవహర్, ప్రిన్సిపాల్ కృష్ణారావు పాల్గొన్నారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయండి

- ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్న ప్రదీప్

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడలో ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం 80 వసంతాల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నప్రదీప్ కోరారు. బుధవారం ఎన్జీవో సంఘం జిల్లా కార్యాలయంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాఘవులును జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ప్రకాష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా రత్నప్రదీప్ మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. ఎస్సీసీ ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘ నాయకులు కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చార్జాన్, జిల్లా ప్రతినిధులు దొరై కన్నన్, శివరాజు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో చర్చిస్తున్న రత్నప్రదీప్, సంఘ నాయకులు

పురాతన మండపం.. పునర్నిర్మాణం

తిరుపతి కల్చరల్ : తిరుమల నడక మార్గంలో అలిపిరి పాదాల మండపం వద్ద శిథిలావస్థకు చేరుకున్న భక్తులు విశ్రాంతి తీసుకునే పురాతన రాతి మండపాన్ని త్వరలో పునర్నిర్మించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి మండపాన్ని పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో అప్పటి రాజులు శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు నడక మార్గానికి ఇరువైపులా రెండు రాతి మండపాలు నిర్మించినట్లు తెలిపారు. వాటిలో ఒకటి శిథిలావస్థకు చేరుకుందని, ఇది వరకే ఒకసారి మరమ్మతులు కూడా చేశారన్నారు. ఈక్రమంలో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం వారు ఇచ్చిన నివేదిక మేరకు మండపాన్ని పునర్నిర్మించాలని టీటీడీ నిర్ణయించిందని వెల్లడించారు. ఇందులోని రాతి స్తంభాలు, పై కప్పును పునర్నిర్మాణంలో వినియోగించనున్నట్లు చెప్పారు. మండపం వెనుక వైపున గోడ పూర్తిగా కూలిపోయిందని, అందుకే భక్తులు లోపలికి వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. రూ.1.36 కోట్లతో త్వరలో ఈ రాతి మండపం పునర్నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. గతంలో తిరుమలలో శిథిలావస్థకు చేరుకున్న పార్వేటి మండపాన్ని పునర్నిర్మించినప్పుడు సామాజిక మధ్యమాల్లో కొందరు వ్యక్తులు టీటీడీపై దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా అసత్య ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈ ప్రసాద్, డిప్యూటీ ఈఈ ప్రకాష్‌బాబు, ఏఈ బాలకృష్ణ పాల్గొన్నారు.



నమూనా చూపుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం

జిల్లాకు 5వేల ఈవీఎంలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు ఐదు వేల ఈవీఎంలు వచ్చాయని, వీటి పరిశీలనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వచ్చిన ఈవీఎంలు పనిచేస్తున్నాయా, లేదా అని ఈనెల 5వ తేదీ నుంచి పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 14 వ తేదీ నుంచి ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. ప్రత్యేక ఇంజినీర్ల సమక్షంలో పరిశీలన ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మరో వారంలో రెవెన్యూ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులకు అధిక సంఖ్యలో దరఖాస్తులను సమర్పించకూడదని తెలిపారు. డీఆర్వో రాజశేఖర్ మాట్లాడుతూ 600 ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఇందుకు జిల్లాలో ఎలాంటి దరఖాస్తులు అందలేదని తెలిపారు. ఈ సమీక్షలో పలు రాజకీయ పార్టీల నాయకులు మహేంద్ర, గంగరాజు, అట్లూరి శ్రీనివాసులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో దొంగల బీభత్సం

సదుం: మండల కేంద్రంలో బుధవారం వేకువజామున దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. ప్రధాన రహదారుల పక్కనే తాళం వేసిన గృహాలను టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేశారు. స్థానికుల కథనం మేరకు.. కాలేజీరోడ్డులోని ఆంజినేయులు, బాలు, రమేష్, రామయ్య ఇళ్లలో చోరీలు జరిగాయి. వీరంతా ఇళ్లకు తాళాలు వేసి బయట ప్రాంతాలకు వెళ్లారు. బుధవారం ఉదయం తాళాలు పగలగొట్టి ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే వీఆర్ఆర్ కాలనీ మార్గంలోని ధరణీధర్, పురుషోత్తం, జాండ్రపేటకు చెందిన బీబీజాన్ ఇళ్ల తాళాలను గుర్తు తెలియని దుండగులు పగలగొట్టారు. కాగా జాండ్రపేటలో ఉదయం 3 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు మంకీకాప్ ధరించి ఉండగా, కుక్కలు తరమడంతో ఓమహిళ వారిని చూసినట్టు తెలిపింది.

ఇద్దరు ఫిర్యాదు: చోరీ ఘటనపై ఇద్దరు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. ఆంజినేయులు ఇంట్లో 29 గ్రాముల బంగారు ఆభరణాలు(రూ.80 వేలు), రూ. 80 వేల నగదు చోరీ అయినట్టు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. ధరణీధర్ ఇంట్లో 10 గ్రాముల బంగారు(రూ.30వేలు), వెండి చైన్(రూ. 4వేలు) చోరీ అయినట్లు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. సంఘటన ప్రదేశాలను సీఐ కృష్ణారెడ్డి, క్లూస్ టీమ్ బృందం పరిశీలించింది.



ఓ ఇంట్లో పగొలగొట్టిన బీరువా, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పెట్రేగుతున్న పాడిఆవుల దొంగలు

- గజ్జలవారిపల్లెలో ఆవు చోరీ
- పుంగనూరు సంతలో ఆవును గుర్తించిన బాధిత రైతు
- పోలీసుస్టేషన్ చేరిన ఆవుల దొంగల పంచాయతీ

పలమనేరు: గత కొన్నాళ్లుగా పలమనేరు ప్రాంతంలో పాడి పశువుల దొంగలు పెట్రేగుతున్నారు. ఇళ్ల ముందు, పశువుల కొట్టాల వద్ద కట్టి ఉంచిన పశువులు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. తాజాగా పలమనేరు మండలం మొరం పంచాయతీ గజ్జలవారిపల్లెలో ఓ రైతు ఇంటి ముందు కట్టి ఉంచిన పాడి ఆవు మంగళవారం అర్ధరాత్రి మాయమైంది. బుధవారం ఉదయం రైతు గ్రామస్తులతో కలసి పుంగనూరు పశువుల సంతకు వెళ్లగా, అక్కడ తన ఆవు ఉండడాన్ని గుర్తించారు. దీంతో వారు పశువును పట్టుకుని, పోలీసుల చెంతకు చేరారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి ఆరు పాడి ఆవులను సంరక్షింకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వీటిలో ఖరీదైన ఎరుపురంగ జెర్సీ ఆవు మంగళవారం రాత్రి గాటిలోనుంచి మాయమైంది. దీనిపై ఆందోళన చెందిన రైతు గ్రామస్తులతో కలసి బుధవారం పుంగనూరులో జరిగే పశువుల సంతకు వెళ్లి గమనించాడు. అక్కడ తన ఆవు కనిపించడంతో అక్కడున్న వ్యక్తిని నిలదీశాడు. తనది గంగవరం మండలం జీడిమాకులపల్లె అని, తనపేరు రెడ్డెప్పగా వారికి తెలిపారు. దీంతో ఆవును స్వాధీనం చేసుకున్న బాధిత రైతు స్థానిక పోలీసులకు చోరీపై ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన పోలీసులు రెడ్డెప్పకు ఆవును ఎవరు అమ్మారనే విషయమై విచారిస్తున్నారు. ఇందులో నిందితుడు నిర్ధారణ అయితే గతంలో ఈ ప్రాంతంలో జరిగిన పాడిఆవుల చోరీలు సైతం బయటపడే అవకాశం ఉంది. దొంగలు పశువులకు మత్తుమందు వాసన చూపి చోరీలు చేస్తున్నట్టు సమాచారం.



సంతలో ఆవును స్వాధీనం చేసుకున్న బాధిత రైతు

వి.కోట మండలంలో చిరుత సంచారం



జవునపల్లె సమీపంలో సంచరిస్తున్న చిరుతపులి



పూతలపట్టు : చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారి

వి.కోట: మండలంలోని జవునపల్లె పంచాయతీ పరిధిలో చిరుత పులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జవునపల్లె పంచాయతీ నక్కనపల్లె సమీపంలో మంగళవారం రాత్రి కుక్కలను వేటాడుతున్న చిరుతపులిని స్థానికులు గమనించారు. భయాందోళనకు గురై కేకలు వేయడంతో పులి పారిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు శివర్లలో భారీగా బాణ సంచా పేల్చి గ్రామం వైపు రాకుండా జాగ్రత్తపడ్డారు. అటవీఅధికారులు, పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. వారు నక్కనపల్లెకు చేరుకుని చిరుత పాదముద్రలను గుర్తించారు. ఇంతలోనే మావత్తూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ వైవే వద్ద పాల ఆటోకు చిరుత ఎదురైంది. రామాపురానికి చెందిన ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్‌లో చిరుతను చిత్రీకరించాడు. వెంటనే అటవీ అధికారులు సమాచారం ఇచ్చాడు. వి.కోట డీఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. స్థానికులతో చర్చించారు. చిరుత సంచారం ఉందని జవునపల్లె పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలం చిటిపిరాళ్ల పంచాయతీ సంజీవిరాయనిపల్లె పంట పొలాల్లో చిరుతపులి సంచరించడం భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి చెందిన సుధాకర్ పొలంలో చిరుత సంచరిస్తున్నట్లు మంగళవారం రాత్రి గుర్తించి, సర్పంచ్ కమలాకర్ రెడ్డికి సమాచారం అందించారు. ఇద్దరూ అటవీశాఖ అధికారులకు విషయం తెలియజేశారు. పూతలపట్టు అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ దేవరాజులు సిబ్బందితో సంఘటన ప్రదేశానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి, చిరుతేనని నిర్ధారించారు. చుట్టుపక్కల అటవీప్రాంతం లేక పోయిన గుట్టలు ఉండడంతో అందులో చిరుత ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పరిసర గ్రామాల్లో బుధవారం దండోరో వేశారు. రాత్రి సమయాల్లో ఎవ్వరు బయట తిరగకూడదని సూచించారు.

హోసూరులో చిత్తూరువాసి దుర్మరణం

హోసూరు: నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మరణించిన ఘటన తమిళనాడులో క్రిష్ణగిరి జిల్లా హోసూరులో సిఫ్‌కాట్ వద్ద జరిగింది. వివరాలు.. ఏపీలో చిత్తూరు జిల్లా తిండరగపల్లి గ్రామానికి చెందిన హేమనాథ్ (23) బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో సూపర్వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం సొంతపనిపై హోసూరుకు వచ్చిన ఇతడు మూకొండపల్లి బస్టాప్ వద్ద నడిచి వెళుతుండగా ఆ మార్గంలో వెళ్లిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. హేమనాథ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.